# నైపుణ్యాలు పెంచేందుకు ఈ లెర్నింగ్




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రీతిమీనా



ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కేసముద్రం: అధికారుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకే నేషనల్ ట్రెనింగ్ పాలసీ కింద కేంద్ర ప్రభుత్వం ఈ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ ప్రీతిమీనా అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ హాస్టల్ భవనంలో శనివారం జిల్లా స్థాయి, డివిజన్, మండల స్థాయి అధికారులకు, ప్రధానోపాధ్యాయులకు కేంద్రం ప్రభుత్వం నిర్వహించే ఈ లెర్నింగ్ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 267 మంది అధికారులను ఈ శిక్షణా కార్యక్రమానికి ఎంపిక చేశామని, మొత్తం ఈ శిక్షణలో 15 అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తామని తెలిపారు. 6 రోజులపాటు జరిగే ఈ శిక్షణకార్యక్రమాన్ని బ్యాచ్‌ల వారీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 60 రోజుల్లో శిక్షణను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ దామోదర్‌రెడ్డి, సీపీవో వెంకటనారాయణ, డీసీ కుమారస్వామి, ఈఎం రాజు, ఆర్డీఓ భాస్కర్‌రావు, ఆర్‌సీఓ వెంకటనర్సయ్య, ట్రాకా రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ డాక్టర్ ప్రీతిమీనా

సాక్షి SAKSHI TELUGU DAILY
Sun, 20 August 2017
epaper.sakshi.com//c/21468513

# శిక్షణ బాగుంది.. మెరుగైన సేవలందిస్తాం



కేసముద్రంలో శిక్షణ పొందుతున్న అధికారులు

## ఈ లెర్నింగ్‌పై అధికారుల సంతృప్తి

**కేసముద్రం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న జిల్లా అధికారులతోపాటు ద్వితీయశ్రేణి అధికారులకు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ లెర్నింగ్ పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలి విడతగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటి. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సాంకేతిక పరికరాలను ఉపయోగించడంతో పాటు పరిపాలన నిర్వాహణకు సంబంధించిన 15 అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో 267 మంది ఉద్యోగులను రోజుకు 45 మంది ఉద్యోగులు చొప్పున ఆరు రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. 60 రోజుల్లో అంతర్జాలంలో 15 అంశాలపై పట్టు సాధించి అనుకున్న లక్ష్యాలు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. శిక్షణ పూర్తయిన అధికారులన మనోగతంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం

### మెరుగైన సేవలు అందించవచ్చు: లక్ష్మణస్వామి, డీఆర్డీవో, ఏపీడీ



ఒక రోజు శిక్షణలో నాయకత్వ లక్షణాలు, సమయపాలన, ఒత్తిడిని తగ్గించుకోవడం, సమస్యను పరిష్కరించడం తదితర అంశాలపై వివరించారు. శిక్షణ ప్రతి రోజూ నిర్వహించే విధుల్లో ఉపయోగపడేలా ఉంది. ఒక రోజుతో శిక్షణ పూర్తి కాలేదు. అంతర్జాలంలో 60 రోజుల్లో శిక్షణ పూర్తి చేయాల్సి ఉంది. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యంతో ప్రజలకు మెరుగైన సేవలందించవచ్చు.

### 15 అంశాలు ఉపయోగకరంగా ఉన్నాయి: ఇందిరాదేవి



ఉద్యోగంలో చేరి 30 సంవత్సరాలవుతోంది. ఇంతవరకు ఇలాంటి శిక్షణ ఎప్పుడూ ఇవ్వలేదు. మౌఖికంగా శిక్షణ ఇవ్వడమే తెలుసు. మొదటిసారిగా అంతర్జాలంలో శిక్షణ ఇవ్వడం బాగుంది. ఉద్యోగ నిర్వహణకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు పారదర్శకంగా ఎలా సేవలందించాలో శిక్షణలో వివరించారు. శిక్షణకు ముందు ఆన్‌లైన్ అంటే తెలిసేది కాదు. శిక్షణ తరువాత ఆన్‌లైన్‌లో సేవలందించగలమనే నమ్మకం వచ్చింది. శిక్షణకు ఎంపిక చేసిన 15 అంశాలు ఉపయోగకరంగా ఉన్నాయి.

### తెలియని విషయాలు తెలుసుకున్నాం

**–ఎస్‌కే కరీం, నీటిపారుదల శాఖ**



శిక్షణలో ఇప్పటిదాకా తెలియని చాలా విషయాలు తెలుసుకున్నాను. ఒక ఉద్యోగిగా ఏం చేయాలి ఎలా చేయాలి అనే విషయాలు వివరించారు. ప్రతి విషయానికి కిందిస్థాయి సిబ్బందిపై ఆధారపడకుండా సొంతంగా కంప్యూటర్‌లో సమాచారం ఇవ్వడానికి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. ప్రజలకు తక్కువ సమయంలో కచ్చితమైన, పారదర్శకమైన సేవలందించేందుకు ఉపయోగపడుతుంది.

### 60 రోజుల్లో శిక్షణ పూర్తవుతుంది

**–నాగమల్లీశ్వరి, సీడీపీవో, డోర్నకల్**



ఈ లెర్నింగ్ శిక్షణ పూర్తి చేయడానికి 60 రోజులు పడుతుంది. ఒక రోజు శిక్షణలో కంప్యూటరు ఉపయోగించడంతో పాటు శిక్షణలో ఎంచుకున్న 15 అంశాలపై వివరించారు. ఉద్యోగ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి. ప్రజలకు మెరుగైన సేవలు ఎలా అందించాలనే విషయాలను శిక్షణలో పొందుపరిచారు. ఒకరు చెబుతుండగా వినడం కాకుండా స్వయంగా అంతర్జాలంలో శిక్షణ పొందడం వల్ల ఉపయోగం ఉంటుంది.

### నైపుణ్యాలు పెంచుకునేలా శిక్షణ

**–వెంకటనారాయణ, సీపీవో**



ప్రజలకు నాణ్యమైన పాలన అందించాలనే లక్ష్యంతో ఆరు రోజుల పాటు జిల్లాలోని 267 మంది ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నాం. ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం శిక్షణ ముఖ్య ఉద్దేశం. మొత్తం 15 అంశాల్లో శిక్షణ ఉంటుంది. అందులో 12 అంశాలు నైపుణ్యాలకు సంబంధించినవి ఉండగా మిగిలిన మూడు ఆర్‌టీఏ, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, ఆఫీస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అంశాలు ఉంటాయి. ప్రతి ఉద్యోగి 60 రోజుల్లో శిక్షణ పూర్తిచేయాల్సి ఉంటుంది.